సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 18 : గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, పంచాయతీ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలో 400 గ్రామ పంచాయతీలు, 3,668 వార్డులు ఉన్నాయన్నారు. ఫిబ్రవరి 8, 2024 ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 4,40,997 మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 2,30,836, పురుష ఓటర్లు 2,10,146 మంది ఉన్నారన్నారు. 650 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలన్నారు. తుది ఓటరు జాబితా ఈ నెల 26న ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగరావు, డీపీవో శ్రీనివాస్, బీజేపీ నాయకులు కె. అంజు కుమార్‌రెడ్డి, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, టీడీపీ నాయకులు రమేశ్, అమ్ ఆద్మీ నాయకులు హైదర్, బీఎస్పీ నాయకులు జగన్, పార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు పరికిపండ్ల స్వదేశ్ ఉన్నారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బాలశక్తి కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ప్రయోగాత్మకంగా 52 విద్యా సంస్థల్లో బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

గోట్కూరి శివారులో విరిగిన స్తంభం ట్రాన్స్‌ఫార్మర్

దళిత రైతులపై చిన్నచూపు

- మూడు నెలలుగా సరఫరా నిలిపివేత
- పడిపోయిన ఏడు విద్యుత్ స్తంభాలు
- జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు
- అయినా ఫలితం శూన్యం

తాంసి, సెప్టెంబర్ 18 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దళిత బస్తీతో పేద కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తే కాంగ్రెస్ పాలనలో అధికారుల నిర్లక్ష్యంతో చీకట్లే మిగులుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని ఘోట్కూరి గ్రామంలో దళిత బస్తీకి చెందిన రైతుల పంట పొలాల్లో కరెంట్ స్తంభాలు నేలకొరిగి మూడు నెలలు దాటింది. కరెంటు తీగలు పత్తి చేనులో చెట్లపైన వేలాడుతున్నాయని రైతులు వాపోతున్నారు. విద్యుత్ షాక్ వస్తుందేమోనని భయంతో రైతులే సర ఫరాను తొలగించారు. ఈ విషయమై విద్యుత్ శాఖ ఏఈకి సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. మండలస్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడంతో జిల్లా స్థాయిలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదని ఆందోళన చెందుతున్నారు. దీంతో పంట పొలాల్లో పనులు నడవక పరేషాన్ అవుతున్నామని లబ్ధిదారులు పసల లక్ష్మి స్వామి, నిమ్మల సరిత సురేష్ తెలిపారు. చేతి కొచ్చే పంట నేలరాలి పోతుందని వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయికి గిరిజన విద్యార్థులు

సోన్, సెప్టెంబర్ 18 : నిర్మల్ మండలంలోని డ్యాంగాపూర్ గ్రామ సమీపంలో గల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల(బాలుర) విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనూష తెలిపారు. ఈనెల 17న నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్ జిల్లాస్థాయి పోటీలు నిర్వహించగా అండర్ -17లో లాంగ్‌జంప్‌లో జె.సందీప్, ఆర్.ప్రదీప్(10వ తరగతి), అండర్-14లో షాట్‌పుట్‌లో జె.కృష్ణ, బి.కృష్ణ(8వ తరగతి) విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 19, 20న హైదరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ఆడనున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను నిర్మల్ జిల్లా డీటీడీవో జె.అంబాజీ, ఏసీఎంవో ఆర్.శివాజీ, పీడీ భూక్యా రమేశ్ అభినందించారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఈత మొక్కలు నాటి రక్షించుకోవాలి

తాంసి, సెప్టెంబర్ 18 : ఈత మొక్కలు నాటడంతోపాటు వాటిని కాపాడుకునే బాధ్యత కల్లుగీత కార్మికులపై ఉంటుందని గౌడ్ కులస్తులకు డీపీఈవో హిమశ్రీ సూచించారు. బుధవారం వన రక్షణ కార్యక్రమంలో భాగంగా వడ్డాడి మత్తడి వాగు ప్రాజెక్టు పరిసరాల్లో ఎక్సైజ్ సిబ్బందితోపాటు ఎంపీడీవోతో కలిసి ఈత మొక్కలు నాటారు. ఇదే ప్రాంతంలో దాదాపు 350 ఈత మొక్కలను ఉపాధి హామీ పథకంలో భాగంగా నాటిన మొక్కలకు సరైన రక్షణ లేకపోయింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గౌడ కులస్తులకు ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఈత చెట్లను అందించడం జరుగుతుందన్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్, సిబ్బంది ముత్యం, లత, సుధం, గిరి, ఎంపీవో లింగయ్య, ఏపీఎం విజయ, పంచాయతీ కార్యదర్శి ఉపాధి హామీ సిబ్బంది నర్సింగ్, గీత కార్మికులు శ్రీనివాస్ గౌడ్, శిరీష్ గౌడ్, లింగం గౌడ్ పాల్గొన్నారు.

ఈత మొక్కలు నాటుతున్న డీపీఈవో హిమశ్రీ

విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా చూడాలి

ఉట్నూర్, సెప్టెంబర్ 18: గిరిజన విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా చూడాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో గిరిజన పోషణ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే యూనిట్ అధికారులు రెండు ఆశ్రమ పాఠశాలలను దత్త తీసుకొని పర్యవేక్షించాలన్నారు. వర్షంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. నాలుగు జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీటీడీవోలు, ఏటీడీవోలు, ఆశ్రమాల వార్డెన్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

ఉట్నూర్, సెప్టెంబర్ 18: గిరిజన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ఈ ప్రాంతానికి పేరు తీసుకురావాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో జాతీయ సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైన సిడాం శంకర్, కుమ్ర సురేందర్, రాథోడ్ శివసాయి, యాదవ్‌రావ్, ఆత్రం శివచరణ్, పెందూర్ హన్మంత్‌లను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వీరు ఈ నెల 19న జరిగే శిక్షణ శిబిరానికి హాజరై అక్కడి నుంచి జార్ఖండ్‌లో అక్టోబర్‌లో 29 నుంచి నవంబర్ 4వరకు నిర్వహించే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారన్నారు. కోచ్‌గా శివకృష్ణను నియమించామన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పీడీ హేమంత్, కోచ్ శేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా